www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 20 ఆగస్టు 2024



ఘనంగా రక్షాబంధన్

ప్రజాశక్తి-సోమల: రాఖీ పౌర్ణమి సందర్భంగా మండలంలోని ఇరికిపెంట పంచాయతీ మేటి మంద ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు రక్షాబంధన్ కట్టి వేడు కలను నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యార్థినులు రాఖీ కట్టి స్వీట్లు పంచిపెట్టారు.




విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

శ్రీసిటీలో ఉపాధి మేటి

- 15వేల మందికి ఉపాధి అవకాశాలు
- రూ.1213 కోట్ల పెట్టుబడికి ఒప్పందాలు
- ఫైర్‌స్టేషన్ ప్రారంభం, పోలీసు స్టేషనకు శంకుస్థాపన
- కంపెనీల సిఇఒలతో సిఎం చంద్రబాబు భేటీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు, సత్యవేడు: తక్కువ ఖర్చుతో ఉత్పత్తుల వేదికగా శ్రీసిటీ అత్యుత్తమ ఎకనామిక్ జోన్‌గా ప్రతిష్టించడమే తమ లక్ష్యమని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి రూ.1213కోట్ల పెట్టుబడి పెట్టేలా ఐదు కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. మరో 15వేల 280 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. శ్రీసిటీ చిరకాల వాంఛ అయిన ఫైర్‌స్టేషన్‌ను ప్రారంభించి, పోలీసు స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సిఇఒలతో సిఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు గా పారిశ్రామికరంగం వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. శ్రీసిటీలో 8వేల ఎకరాల్లో పారిశ్రామిక జోన్లు ఏర్పాటయ్యాయని, 220 కంపెనీల ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. సెజ్, డొమెస్టిక్ జోన్, ఫ్రీ ట్రేడ్ జోన్ ఇక్కడ ఏర్పాటయ్యాయి. ఆటోమేటివ్, ఎలక్ట్రానిక్స్, ఎఫ్‌ఎంసీజీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వచ్చాయి. శ్రీసిటీలో 4.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించడం, 4 బిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించడం గొప్ప విషయం అన్నారు. శ్రీసిటీని అత్యంత అనుకూల నివాసయోగ్య ప్రాంతంగా మారుస్తాం అన్నారు. పచ్చదనం కోసం వంద శాతం వర్షం నీటి సంరక్షణకు చర్యలు చేపడతామన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

శ్రీసిటీ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. ఉదయం 12 గంటలకు శ్రీసిటీ హెలిపాడ్ వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి బిజినెస్ సెంటర్ చేరుకున్న సీఎంకు పూర్ణకుంభం, మేళతాళాలతో ఆహ్వానం పలికారు. పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్, చెరుకూరి శ్రీధర్ డైరెక్టర్ ఇండస్ట్రీస్, ఏపిఐఐసి విసి, ఎండి అభిషిక్త కిషోర్, తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, డిఐజీ షిమోషి బాజ్ పాయ్, ఎస్.పి సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు నెలవల సుబ్రమణ్యం, పరసారత్నం, వెలగపల్లి వరప్రసాద్, హేమలత, ఎస్ సి వి నాయుడు తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

సిఎం పర్యటన సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం 12.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేరుకున్నారు. 12.21 గంటలకు శ్రీసిటీ హెలిప్యాడ్‌కు బయల్దేరారు. 12.43 గంటలకు శ్రీసిటీ హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.



పారిశ్రామిక వేత్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- రేణిగుంట విమానాశ్రయంలో కమిషనర్ మౌర్య, డిఆర్‌ఒ పెంచల్‌కిషోర్, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, గూడూరు ఎంఎల్‌ఎలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, మురళి, భానుప్రకాష్, పాశం సునీల్‌కుమార్, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌నాయుడు స్వాగతం పలికారు.
- శ్రీసిటీ పారిశ్రామికవాడలో 1570 కోట్ల పెట్టుబడితో 8480 మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పన దిశగా 16 పరిశ్రమలను ప్రారంభించారు. రూ.900 కోట్ల పెట్టుబడితో 2740 మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే విధంగా 8 పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు.

చంద్రబాబుకు రాఖీ కట్టిన హోంమంత్రి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు హోంమంత్రి వంగలపూడి అనిత రాఖీ కట్టారు. మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ సైతం రాఖీ కట్టి సోదరభావాన్ని వెలిబుచ్చారు.





గ్రామ సభల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

అధికారులకు డిప్యూటీ సిఎం ఆదేశం

పజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 23వ తేదీ నుండి అన్ని గ్రామ పంచాయతీ లలో గ్రామ సభల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 26 జిల్లాల జెడ్పీ సీఈఓలు, డిపిఓలు, డ్వామా పీడీలు, మండలాల్లో ఎంపీడీఓలు, ఈవో పిఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఏపీఓలతో ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం గ్రామ సభ నిర్వహణ విధి విధానాలపై ఉప ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణ చేపట్టాలని , ఉపాధి పథకం పరిధిలో 46 రకాలైన పనులు చేపట్టవచ్చునని, జాబ్ కార్డు కలిగిన వారికి వందరోజుల పని దినాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ పథకం ద్వారా రూ. వేల కోట్లు నిధులు వెచ్చిస్తున్నామని, ప్రతి రూపాయిని బాధ్యతతో వ్యయం చేయాలని, ఉపాధి హామీ లక్ష్యం అందు కోవాలనన్నారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి, మండల, గ్రామ స్థాయిలో ఉన్న అధికారు లు ఈ పథకం పనులు అమలులో బాధ్యత తీసుకోవాలని,సోషల్ ఆడిట్ విభాగం పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర సచివాలయం నుంచి పిఆర్ అండ్ ఆర్‌డి ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా సచివాలయం నుండి డ్వామా పీడీ ఎన్ రాజశేఖర్, జడ్పీ సీఈఓ గ్లోరియా, డిపిఓ లక్ష్మి, పిఆర్‌ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డిపిఆర్సి కోఆర్డినేటర్ షణ్ముగం మండలాల ఎంపీడీఓలు, ఈఓపీ ఆర్డీలు,డ్వామా, పి ఆర్ శాఖలకు చెందిన సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు



విద్యా సంయుక్త సంచాలకులకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సర్దుబాటుపై చర్చించాలి

విద్యా సంయుక్త సంచాలకులకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా ఉపాధ్యా యుల సమగ్ర సీనియార్టీ, రెగ్యులరైజేషన్ జాబితా విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలని పాఠ శాల విద్యా సంయుక్త సంచా లకులు పార్వతికి యుటిఎఫ్ నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి యూనియన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో చర్చించిన మేరకు టీచర్లను సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణ రావు, యూట్యూబ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ మణి గండన్ పాల్గొన్నారు.



కబ్జాకు గురైన మంచి నీళ్ల గుంటను సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్ ఫొటో)

మంచి నీళ్లగుంట కబ్జా

ప్రజాశక్తి -విజయపురం: మండల రెవెన్యూ , ఎంపీడీవో కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న మిట్టూరు మంచినీళ్ల గుంట కబ్జాకు గురైంది. సుమారు 2.36 ఎకరాలు ఉన్న గుంట రాను రాను కుంచించుకు పోయింది. దీన్ని గమనించిన గ్రామస్థుల అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సర్వే చేయగా ఇందులో ఆసక్తి కరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గుంట చుట్టూ ఉన్న వ్యవసాయ రైతులు మంచి నీళ్ల గుంట స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు అధికారులు గుర్తించారు. అధికారులు వారికి నోటీసులు ఇవ్వక పోవడంపై గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 మందికి పైగా అధికారులు వచ్చి ఒక రోజంతా సర్వే చేసి అక్రమాలను గుర్తిస్తే, వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు తీరు చూస్తుంటే అనుమానం కలుగుతోందని, జిల్లా అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్) లో వచ్చే ప్రి ఫిర్యాదునూ వెంటనే పరిష్క రించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారు లను ఆదేశించారు. జిల్లా కలెక్టరే ట్ లోని నూతన భవనం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్(పి జి ఆర్ ఎస్)ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, డిఆర్‌ఓ బి పుల్లయ్య, డ్వామా డీపీ రాజశేఖర్ లతో కలిసి జిల్లా పలు ప్రాంతాల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ అర్జీదారుల సమస్యల గురించి క్షుణ్ణంగా తెలుసుకొని సమస్య పరిష్కా రానికి సంబంధిత అధికారులతో స్వయంగా తానే ఫోన్‌లో మాట్లాడడంతో పాటు అర్జీదారుని ద్వారా సమస్యను వివరించి చర్యలు తీసుకొనేలా చేస్తూ జిల్లా యంత్రాంగాన్ని పూర్తిగా ఈ పనిలో నిమగ్నం అయ్యేలా అధికా రులకు తగు దిశా నిర్దేశం చేస్తు న్నారు. ప్రజా సమ స్యల పరిష్కా రానికి జిల్లా స్థాయి లోనే కాక, నియోజక వర్గ, మండ ల స్థాయిలో నిర్వహిం చే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విధిగా నిర్వహిస్తామని సంబంధిత అధికారు లు హాజరు కావడం ద్వారా సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని తెలిపారు. ప్రభుత్వ అధికారులు జవాబు దారీగా వ్యవహరిం చాలని, ఈ కార్య క్రమంలో అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.



అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

శాఖల వారీగా ఫిర్యాదులు

రెవెన్యూ శాఖకు సంబంధించి 104, రిజిస్ట్రేషన్ శాఖ 1, ఐసిడిఎస్ 1, డిపిఓ 2, డిఎస్‌ఓ 2, డిసి హెచ్ఎస్ 1, హెచ్ఎన్ఎస్ఎస్(హంద్రీ–నివా) మదనపల్లి 1, సాంఘీక సంక్షేమ శాఖ 1 ఫిర్యాదు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, డిఆర్‌ఓ, డ్వామా పీడీ లకు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారు లు పాల్గొన్నారు.

అక్రమంగా తొలగించిన మెప్మాలను కొనసాగించాలి

డిఆర్‌ఓ, మెప్మా పీడీలకు సిఐటియు వినతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అక్రమంగా తొలగించిన పలమనేరు ఆర్పీలను వెంటనే పనిలోకి తీసుకోవాలని కలెక్టరేట్‌లో డిఆర్‌ఓ పుల్లయ్యకు, మెప్మా పీడీలకు సీఐటీయు ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్పీల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తాలు మాట్లాడుతూ మున్సిపాలిటీలో డాష్ యాప్ తో మహిళల నుంచి డబ్బులు కట్టించారనే ఉద్దేశంతో 16 మంది ఆర్పిలను తొలగించడం భావ్యం కాదని తెలిపారు. ఎలాంటి విచారణ లేకుండా సంబంధం లేని వారిని కూడా రాజకీయంగా తొలగించడం మంచిది కాదని హితవు పలికారు. 'తప్పుకు పాల్పడితే చర్య తీసుకోవాలి కానీ సంబంధం లేని వారిని కూడా తొలగించడం ఏమిటి?' అని ప్రశ్నించారు. రాజకీయ కారణాలతో పోలీసులు కేసులు పెట్టడం కలెక్టర్ నియమించిన కమిటీ కూడా ఆర్పీలను ఎలాంటి విచారణ చేయకుండా తొలగించడం అనుమానాలకు దారి తీస్తోందన్నారు. ఇప్పటికైనా విచారణ చేసి తప్పు రుజువయ్యే వరకూ ఎవరిని నియమించకూడదని కోరారు. స్థానిక ఎమ్మెల్యే ఈ సమస్యలపై స్పందించి ఆర్పీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు .



మెప్మా పీడీతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

విచారణలో ప్రమేయం లేకపోతే కొనసాగిస్తాం: పీడీ

పోలీసులు విచారణ అనంతరం ఆర్పీలకు ఎలాంటి సంబంధం లేదని రుజువైతే వీరిని కొనసాగిస్తామని పీడీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాధిత ఆర్పీలు పాల్గొన్నారు.



జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మహిళలపై హత్యాచారాలు అరికట్టాలి

గాంధీ విగ్రహం ఎదుట మహిళల నిరసన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కలకత్తాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట జన విజ్ఞాన వేదిక సమతా విభాగం నేతృత్వంలో మహిళలు నిరసన వ్యక్తం చేస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమత జిల్లా కన్వీనర్ జయంతి, గురజాల ప్రతిమ, యూట్యూబ్ నాయకురాలు ఫాతిమా, మాజీ మేయర్ కటారి హేమలత మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ కోలకత్తా నగరంలో ఉన్న ఆర్.జి కార్ వైద్య కళాశాలలో ఈనెల తొమ్మిదవ తేదీన రాత్రి డ్యూటీలో ఉన్న ట్రైనీ డాక్టర్‌పై లైంగికంగా దాడి చేసి హత్యాచారం చేసి మెడ ఎముకలు విరిచి శరీరంపై విచక్షణారహితంగా దాడి చేసి కొట్టి చంపడం అత్యంత దారుణమైన సంఘటన అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను కఠిన తరం చేసి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. నిందితులను బహిరంగంగా ఉరి తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు సుధాకర్ నాయుడు, అరుణ శివప్రసాద్, యుటిఎఫ్ నాయకులు సోమశేఖర్ నాయుడు, తెలుగు మహిళా విభాగం నాయకులు కార్యకర్తలు, వివిధ ప్రైవేటు కళాశాలల మహిళలు, కరస్పాండెంట్లు, పాఠశాల విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు.

రేపు టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ఈనెల 21వ తేదీ బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పోటీల ఎంపిక నిర్వహిస్తామని చిత్తూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ సెక్రటరీ చిన్నప్ప తెలిపారు. ఈ సబ్ జూనియర్స్ టెన్నికాయిట్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు2010, ఏప్రిల్ 1 తరువాత జన్మించి ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జారీ చేసిన డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు తప్పకుండా తమ వెంట తీసుకురావాలని తెలిపారు. ఎంపిక అయిన వారు శ్రీకాకుళం జిల్లా పలాస పట్టణంలో సెప్టెంబర్ 14, 15, 16 తేదీలలో జరిగే అంతర్ జిల్లాల టెన్నికాయిట్ పోటీలలో పాల్గొంటారని క్రీడాకారులు తమ సొంత ఖర్చుతో పోటీలలో పాల్గొనాలని వివరాలకు7780250922 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు.

వీధి నాటకాలకు జీవం పోస్తున్న కళాకారులు

- పెరుగుతున్న ఆదరణ - రెండు రాష్ట్రాల్లో మంచి పేరు - ప్రోత్సహిస్తే మరింత రాణింపు

అంతరించి పోతున్న వీధి నాటకాలకు ఇల్లత్తూరు గ్రామానికి చెందిన కళాకారులు జీవం పోస్తున్నారు. ఊరూరా తిరుగుతూ వీధి నాటకాలను ప్రదర్శిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా నాటకాలు ఉంటుండటంతో చాలా మంది వాటిని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు కళాకారులకు విరాళాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. నేటి సమాజంలో టీవీ, సినిమాలు, సీరియళ్లపై మోజు పెరిగినా వీధి నాటకాలకు ఉండే క్రేజ్ మాత్రం నేటికి తగ్గడంలేదు. తమను ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత రాణిస్తామని కళాకారులు పేర్కొంటున్నారు.



ప్రజాశక్తి -విజయపురం: అంతరించి పోతున్న వీధి నాటకాలకు చిత్తూరు జిల్లా, విజయపురం మండలం, ఇల్లతూరు గ్రామానికి చెందిన కళాకా రులు జీవం పోస్తు న్నారు. ఏడాదికి 300 రోజులు ఊరూరా తిరుగు తూ వీధి నాట కాలను ప్రదర్శిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. తెలుగు, తమిళ బాషాలో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా నాటకాలు వేస్తున్నారు. నేటి సమాజంలో టీవీ, సినిమాలు, సీరియళ్లపై మోజు పెరిగినా ఇల్లత్తూరు గ్రామానికి చెందిన వీధి నాటకాలకు ఉండే క్రేజ్ మాత్రం ఇప్పటికీ తగ్గడంలేదంటే అర్థచేసుకోవాలి. సుమారు 70 ఏళ్లుగా కళాకారులను తీర్థిదిద్దడంలో ఇల్లత్తూరుకు మంచి పేరు వుంది.

యువకుల్లో పెరిగిన ఆసక్తి

గ్రామాల్లో టీవీలు, సినిమాలను ఒకవైపు చూస్తున్నా వీధి నాటకాలపై కూడా ప్రజలు ఆసక్తిని చూపుతున్నారు. ఈ నాటకాలను ప్రదర్శించేందుకు యువతతోపాటు పెద్దలు కూడా ఉత్సాహం చూపుతున్నారు. గ్రామాల్లో కొంతమంది వీధి నాటకాలను ప్రత్యేకంగా నేర్చుకొని గ్రామస్తులు, కుటుంబసభ్యుల మధ్య ప్రదర్శించి మురిసిపోతున్నారు. తండ్రి తరువాత కొడుకు కూడా వీధి నాటకాలల్లో శిక్షణ తీసుకొని, కళాలకు జీవం పోస్తున్నారు.

మహాభారతం నాటకలపై ఎక్కువ ఆసక్తి

ఇల్లత్తూరు గ్రామానికి చెందిన కళాకారులు ఎక్కువగా మహాభారతం నాటకాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దుర్యోధన వధ, సత్యహరిచంద్ర, శ్రీరాముని పట్టాభిషేకం, వంటి వివిధ నాటకాలను ప్రదర్శించేందుకు కళాకారులు ఆసక్తి చూపుతున్నారు. అంతే కాకుండ భక్తప్రహ్లాద, భక్తసిరియాళ, శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం, చెన్నకేశవస్వామి మహాత్మ్యంతోపాటు భక్తికి సంబంధించిన నాటకాలను ప్రదర్శిస్తున్నారు. గ్రామాల్లో కొంత మంది కళాకారులు బృందాలుగా ఏర్పడి పౌరాణిక నాటకాల్లో అనుభవం ఉన్న వారి ద్వారా ప్రత్యేకంగా తీసుకొని నాటకాల్లో నాటించి ప్రజల మన్ననలను పొందుతున్నారు.



వీధి నాటకాలే ప్రాణం

నేను 30 ఏళ్లుగా వీధి నాటకాలు వేస్తున్నాను. మా తండ్రి తరువాత నేను నాటకాలు వేస్తున్నాను. వీధి నాటకాలు వేస్తుంటే చాలా మంది మమ్మల్ని అభినందించడం చాలా సంతోషంగా ఉంది. ఒక్కో సారి పెద్ద పెద్ద రాజకీయ నాయకులు కూడా మా నాటకాలను చూస్తారు. ఏడాదిలో 300 రోజులు బిజీగా ఉంటున్నామని ఓ కళాకారులు తెలిపాడు.

కళాకారులను ప్రోత్సహించాలి

గ్రామాల్లో నేటికీ కళలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. కళాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తే వారు తమ కళను మరింత ప్రదర్శించే అవకాశముంటుంది. ఇందుకోసం ప్రభుత్వం కళాకారులకు ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని మరో కళాకారుడు కోరాడు.

రేపటి నుండి బిఎల్‌వోల ఇంటింటి సర్వే : డిఆర్‌ఓ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: భారత ఎన్నికల సంఘం స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ఫొటో ఎలక్టోరల్ రోల్ లో భాగంగా నూతన ఓటరు నమోదు, పాత ఓటరు జాబితాలో సవరణకు సంబంధించి ఈ నెల 21వ తేదీ నుండి బి ఎల్ ఓ లు ఇంటింటి సర్వే చేపట్టనున్నారని డిఆర్‌ఓ బి పుల్లయ్య పేర్కొన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ పై జిల్లా సచివాలయం లోని డిఆర్‌ఓ ఛాంబర్‌లోని సమావేశపు మందిరంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మాట్లాడుతూ 2025 జనవరి 1 వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండినవారు ఓటరుగా నమోదు కావచ్చునని, నూతన ఓటరు నమోదు, పాత ఓటరు జాబితాలో సవరణకు సంబంధించి జిల్లా నుండి తయారు చేసిన వివరాలను అక్టోబర్ 3వ తేదీ లోపు సిఇఓ కు పంపాలని, వచ్చిన నివేదికలను కన్సాలిటేషన్ చేసి సిఇఓ, ఇసిఐ ఆమోదం నిమిత్తం అక్టోబర్ 8 లోపు పంపాలని తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం అక్టోబర్ 19వ తేదీ నాటికి పూర్తిచేసి అక్టోబర్ 29న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తారని తెలిపారు. 2025 జనవరి 6 వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారని తెలిపారు. గతంలో ఉన్న ఓటరు జాబితాకి సంబంధించి సవరణలో భాగంగా ఓటరు గుర్తింపు కార్డులో ఫొటో సరిగ్గా లేకపోవడం, ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు వివిధ పోలింగ్ స్టేషన్లలో గుర్తింపు కార్డులు రావడం ఇలా రాజకీయ పార్టీల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అవకాశం వుందన్నారు. క్లైయిమ్‌లు, అభ్యంతరాలకు సంబంధించి స్పెషల్ క్యాంపెయిన్ దినాలుగా నవంబరు 9, 10, 23, 24వ తేదీలలో (రెండవ శనివారం, ఆదివారాలలో) నిర్వహిస్తామని, బిఎల్‌ఓలు వారి పోలింగ్ స్టేషన్లలో ఓటరు జాబితాతో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఎన్ రాజశేఖర్, రాజకీయ పార్టీ ప్రతినిధులు బిజెపి–అట్లూరి శ్రీనివాస్, సిపిఎం నాయకులు గంగరాజు, పేర్కొన్నారు.



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న డిఆర్‌వో పుల్లయ్య

ప్రతి కార్డుదారునికీ బియ్యం అందించాలి: తహశీల్దారు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రతి కార్డు దారునికీ ఉచిత బియ్యాన్ని అందించాలని తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ డీలర్లను ఆదేశించారు. తహశీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ వారి పరిధిలోని కార్డు దారులకు బియ్యం సక్రమంగా అందలేదని గత మండల సమావేశంలో ఫిర్యాదు అందించారన్నారు. ఈ ఫిర్యాదు మళ్లీ రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత డీలర్లపై వుందన్నారు. ఈ సమావేశంలో డిటి అనిల్ కుమార్, డీలర్లు సుధాకర్ రెడ్డి, రాధాకృష్ణ, మొగిల్ రెడ్డి, రసూల్ బాషా, కోదండ, రఘు, కృష్ణయ్య నాయుడు, డీలర్లు పాల్గొన్నారు.



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్

పంచాయతీల్లో మౌలిక కల్పనే లక్ష్యం

ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాఘవేంద్ర రాజు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాఘవేంద్ర రాజు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల విధులు, బాధ్యతలపై శిక్షణలో గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణ, వర్మీ కంపోస్టు తయారీ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, వీధి దీపాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్గించారు. ఈ శిక్షణ తరగతులు మూడు రోజుల పాటు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారులు శివయ్య, శ్రీనివాసులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్‌డీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -విజయపురం: విజయపురం మండలం ఈవోపీఆర్‌డీగా పంచాయతీ కార్యదర్శి ఎంఎస్ సురేంద్రకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రస్తుతం విజయపురం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. చిత్తూరు జిల్లా డీపీవో ఉత్తర్వుల మేరకు సోమవారం ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు చేపట్టారు. గ్రామాభివృద్ధి, పారిశుధ్య మెరుగు పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. అనంతరం మండల సిబ్బంది, సచివాలయ సిబ్బంది శాలువా, పూలమాలలతో సత్కరించారు.



ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు చేపట్టిన ఎంఎస్ సురేంద్రకుమార్

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి: ఎంపిడివో



మాట్లాడుతున్న ఎంపిడివో చంద్రమౌళి

ప్రజాశక్తి -విజయపురం: గ్రామాల్లో పారిశుధ్యం, రక్షిత తాగునీరు సరఫరాపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామీణాభివృద్ధిపై మూడు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి వర్షాకాలం సమీపిస్తున్న కారణంగా వ్యర్థ పదార్థాలు పేరుకుపోకుండా ఎప్పటి కప్పుడు గ్రామాల్లో పారిశుధ్య పనులు, కాలువల్లో మురుగునీరు నిలిచి పోకుండా చూడాలన్నారు. గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, గ్రామాల్లో జ్వరాలు, విరోచనాలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టలన్నారు. అవసరమైతే గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు ఎంపీడీవో కార్యాలయంలోని ట్రైనర్స్ సద్గుణ మహేష్ , ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ట్రైనర్ సద్గుణ మహేష్ మాట్లాడుతూ పంచాయతీలో పారిశుధ్యం, డ్రైనేజ్ క్లీనింగ్, వీధిలో విద్యుత్ దీపాలు, గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా శుభ్రమైన తాగునీరు అందించాలని సర్పంచ్‌లకు, కార్యదర్శిలకు, పంచాయతీ అభివృద్ధికి ఎలా తోడ్పడాలి విషయంపై శిక్షణ ఇచ్చారు.

ఘనంగా కరకమాణి గంగమ్మ ఆలయ కుంభాభిషేకం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్‌పురం మండలంలోని సింధూ రాజపురంలోని కరకమాణి గంగమ్మ నూతన ఆలయ మహా కుంభాభిషేకం ఆ గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు చల్లం పాపయ్య, కుమార్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్తులు కోలాటం భక్తులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ బాలాజీ నాయుడు బెంగుళూరు చెందిన చెంచుయాదవ్, ప్రకాష్ యాదవ్ , పారిశ్రామికవేత్త చెన్నై గంగాధరం, చంద్ర యాదవ్ , రాజేంద్ర యాదవ్ చిరంజీవి యాదవ్, చెంచుయాదవ్, ప్రకాష్ యాదవ్ ,చంద్ర యాదవ్ ,రాజేంద్ర యాదవ్ చిరంజీవియాదవ్, సుధాకర్ యాదవ్ సుబ్రహ్మణ్యం యాదవ్ ఆంజనేయులు ,విశ్వరూప ఆచార్యులు బాబు నాయుడు , లోకనాథరాజు పాల్గొన్నారు.

'పై విలువలపై ప్రజ్ఞాధారణ చేపట్టాలి'

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పై విలువపై ప్రజ్ఞ ధారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ మెస్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ శివప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పై విలువలపై ప్రజ్ఞ ధారణ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ శివ ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని లహరి పై విలువను 600 దశాంశ స్థానాలను అవలీల గా చెప్పింది. నాలుగు నిమిషాల యాభై రెండు సెకండ్లలో 600 దశాంశ స్థానాలను తెలిపి అబ్బురపరిచింది. పాఠశాల విద్యార్థుల నైపుణ్యం అమోఘమని వారి ప్రతిభను గుర్తిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని ప్రస్తుతం పై విలవ అంతం కానిదని దీని విలువను 600 స్థానాలను కళ్లకు గంతలు కట్టుకొని చెప్పడమే కాకుండా ఆ విలువలలో యాదృచ్ఛిక విలువను సైతం లహరి చెప్పడం గర్వకారణం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవి, మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఇవోకు సన్మానం

ప్రజాశక్తి - కార్వేటినగరం :

జిల్లా ఉత్తమ ఎంఈఓ అవార్డును మంచికాయల విజయ్ కుమార్ ఆగస్టు 15 జిల్లా రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డిఎం పురం క్లస్టర్ పరిధిలో ఉపాధ్యాయుల బృందం సోమవారం మంచికాయల విజయ్ కుమార్ ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఇలాంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని కోరారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంఈఓ అవార్డు రావడం మన మండలానికి ఎంతో గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 మనోజ్ కుమార్, హెచ్‌ఎంలు కేశవులు, డైట్ అధ్యాపకులు చెంగల్రాజు, ఉపాధ్యాయులు రాబర్ట్, గోపి, సిఆర్పి కార్తీక్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- విజయపురం:

మండలంలోని ఇష్టకామేశపురం ప్రాథమిక పాఠశాలలో రిటైర్డు ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య విద్యార్థులకు సోమవారం విద్యా సామగ్రి పింపిణీ చేశారు. ఒకటి నుండి ఐదు వరకు చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటుపుస్తకాలు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయమ్మ, అంగన్‌వాడీ, కార్యకర్త రోజా పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి -బంగారుపాలెం:

బంగారుపాళ్యం మండలం మాధవ నగర్ వద్ద వున్న బ్రహ్మానంద ఆశ్రమంలో శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని సత్యనారాయణ వ్రత పూజ ఆశ్రమ నిర్వాహకులు కేశవానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జెడ్‌పీ పిఎఫ్ సమస్యలకు పరిష్కారం

- స్పందించిన కలెక్టర్
- ఆన్‌లైన్‌లో వుంచేందుకు చర్యలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఏళ్ల తరబడి కనిపించని జెడ్‌పీ పిఎఫ్ స్లిప్పులు, రుణాలు, తుది మొత్తాలు పొందడంలో ఎదురవుతున్న సమస్యలు త్వరలో పరిష్కారం కానున్నాయి. పిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జెడ్పీ సీఈఓకి, కలెక్టర్‌కి యుటిఎఫ్ త్వరలో ధర్నా నిర్వహించనున్నట్లు ఉద్యమానికి పిలుపు నిచ్చింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ సమిత్ కుమార్ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ అధికారి మైలవరపు కృష్ణ తేజతో నేరుగా మాట్లాడి, లేఖను పంపారు. కలెక్టర్ సూచన మేరకు సోమవారం విజయవాడలో యుటిఎఫ్ తరపున రాష్ట్ర కార్యదర్శి జి.వి.రమణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, జిల్లాపరిషత్ ప్రతినిధి లక్ష్మీపతి తదితరులు పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్, మైలవరపు తేజ ని కలసి చర్చించారు. అధికారులతో అప్పటికప్పుడు మాట్లాడి పిఎఫ్ స్లిప్పులు ఆన్లైన్ లో అందుబాటులో వుండేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకున్నారు. కొన్ని చోట్ల పాఠశాల స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, ప్రభుత్వ పాఠశాలల స్థలాలు మొత్తం సర్వే చేయించి, తాజా రికార్డులను తయారు చేయించి, విద్యాశాఖకు అందజేయాలని నాయకులు కోరగా మంచి సూచన చేశారని డైరెక్టర్ ప్రశంసించారు. కారుణ్య నియామకాల సమస్య పరిష్కరించాలని కోరగా, తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. యుటిఎఫ్ నేషనల్ నేతల కృషితో జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ సమస్యలు పరిష్కారం కానున్నాయి.

ఖాజీగా అర్హత లేని వారిని నియమించారు..

కలెక్టర్‌కు టిడిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

ఖాజీని నియమించేందుకు స్థానిక ఎమ్మెల్యే, మసీదు కమిటీల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అర్హత లేని ఇమ్రాన్‌ను నియమించడం పట్ల టిడిపి మైనార్టీ నాయకులు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇమ్రాన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని చిత్తూరు కలెక్టరేట్ లో నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్ సుమంత్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనారిటీ నాయకులు అత్తు భాయ్, అన్సర్ భాయ్, జీలాని, టైలర్ బాష, అన్సర్, భాను, సిరాజ్ భాయ్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

అత్యుత్తమ సేవలకు అవార్డు

ప్రజాశక్తి -గుడిపల్లి: గుడిపల్లి మండలంలోని యామగానపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ శివ శంకర్‌కు పంచాయతీ రాజ్ అత్యుత్తమ సేవా ప్రశంసా పత్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి అందించారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లా డుతూ.. 2024 సంవత్సరంలో ఈ ప్రశంసా పత్రాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉందని, ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తానని, గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే తనకు తెలపాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి ప్రశంసాపత్రం అందిస్తున్న డిపివో

ఉత్తమ విద్యార్థినులకు చేయూత

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించే తూగుండ్రం విద్యార్థులకు ప్రతి సంవత్సరం తోడ్పాటు అందిస్తానని సెల్ కాన్ కంపెనీ ఎండీ గురుస్వామి నాయుడు అన్నారు. సెల్ కాన్ మొబైల్ కంపెనీ ఎండీ విద్యాభ్యాసం చేసిన గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం హైస్కూల్లో సోమవారం 2023-24 సంవత్సరంలో టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులకు సెల్ కాన్ ఎండీ సతీమణి హేమావతి, జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమనాయుడు, చిత్తూరు బాలాజీ మొబైల్స్ యాజమాని వెంకటేష్ నాయుడులతో కలిసి లక్ష్మీసుధకు ప్రథమ బహుమతి రూ.25 వేలు, తేజశ్వినికి ద్వితీయ బహుమతి రూ. 15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రాజేంద్ర నాయుడు, ఎన్ఆర్‌పేట హైస్కూలు హెచ్‌ఎం రమేష్, స్కూల్ కమిటీ ఛైర్మన్ సుధా కర్ శెట్టి, నేతలు నియాజ్ అలీ, నీరజాక్షులు రెడ్డి, జీవరత్నం, శాంతకుమార్, కండ్రిగ శంకర్, సంపత్, రాఘవేంద్ర , దాసరపల్లె శంకర్, శివనాయుడు, పలువురు టీచర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థినులకు నగదు బహుమతులు అందిస్తున్న దాత

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఎనిమిది వినతులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో ఎనిమిది వినతులు అందినట్లు నగర కమిషనర్ డాక్టరు జె అరుణ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సహాయ కమిషనర్ రామకృష్ణుడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా ఇంజనీరింగ్ -6, టిడ్కో -1, టౌన్ ప్లానింగ్ -1 చొప్పున మొత్తం ఎనిమిది వినతులు అందాయి. వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టరు అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'హత్యాచార హంతకులను కఠినంగా శిక్షించాలి'

ప్రజాశక్తి -పలమనేరు: కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడిన హంతకులను కఠినంగా శిక్షించాలని జాతీయ మానవ హక్కులు , అవినీతి నిర్మూలన సంస్థ, బహుజన రైతు కూలీల సమైక్య అధ్యక్షులు శివాడి గోవిందు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందులో భాగంగా సోమవారం కార్యదర్శి మణి అధ్యక్షతన ఈ విషయంపై ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు డి.సుబ్రహ్మణ్యం , శివన్న మాట్లాడుతూ కలకత్తాలో ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ డాక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సందర్భంలో నరరూప రాక్షసులు మూకుమ్మడిగా దాడి చేసి హత్యాచారం చేయడం దుర్మార్గమన్నారు. హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సమావేశంలో మహిళా నాయకురాలు సరస్వతి , సుమతి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రెండు కోట్ల రూపాయలు పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 5 ఎకరాలు పొలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తి దారులు సంఘం నాయకులు వెంకటేష్, బిల్డింగ్ అసోసియేషన్ నాయకులు సాంబశివ, చిరు వ్యాపారాల సంఘం నాయకులు బాబు పాల్గొన్నారు.

గంగవరం: కోల్ కత్తా పట్టణంలో జూనియర్ డాక్టర్ పై అఘాయిత్యానికి పాల్పడిన హంతకులను కఠినంగా శిక్షించాలని మండలంలోని ఎంవీఆర్ కళాశాల విద్యార్థులు సోమవారం పుంగనూరు- పలమనేరు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ కలకత్తా ఆర్జీ కార్ ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ డాక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సందర్భంలో నరరూప రాక్షసులు మూకుమ్మడిగా దాడి చేసి అత్యాచారం హత్య చేయడం దుర్మార్గమన్నారు. అటువంటి మానవ మృగాలను బెంగాల్ ప్రభుత్వం రక్షించడానికి ఆనవాళ్లు లేకుండా చేయడానికి ప్రయత్నిస్తుండడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. బాధిత కుటుంబానికి రెండు కోట్ల రూపాయలు పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 5 ఎకరాలు పొలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి దేశవ్యాప్తంగా మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రత్యేకమైన చట్టాలను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థిని విద్యార్థులు , అధ్యాపకులు పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : దేశంలో వైద్యులను, వైద్య విద్యార్థులను రక్షించాలని కోరుతూ కుప్పం నర్సింగ్ కళాశాల విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో వైద్యుల, వైద్య విద్యార్థులకు, ముఖ్యంగా మహిళా విద్యార్థులకు రక్షణ కరువైందన్నారు. ఇటీవల కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో ట్రైనీ డాక్టర్ పై అత్యాచారం, హత్య ఘటన దేశాన్ని కుదిపేస్తోందన్నారు. ఈ దాడిని ఖండిస్తూ నిందితులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

వైభవంగా కిషన్ చంద్ గృహప్రవేశ వేడుకలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గురుశాల కిషన్ చంద్ నూతన గృహప్రవేశం వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కిషన్ తిరుపతి మహిళా యూనివర్సిటీ సమీపంలో నూతనంగా నిర్మించిన గృహానికి గృహప్రవేశం సోమవారం చేశారు. గృహప్రవేశానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల రాజకీయ నాయకులను, కార్యకర్తలను ఆహ్వానించారు. గృహప్రవేశానికి నియోజకవర్గంతో పాటు తిరుపతి, చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గృహప్రవేశానికి హాజరైన వారు కిషన్ చంద్ దంపతులను ఆశీర్వదించారు. ప్రత్యేకంగా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించిన పాత్రికేయులు గృహప్రవేశంలో



పాల్గొని కిషన్ చంద్ దంపతులను ఆశీర్వదించారు

స్కూల్ కాంప్లెక్స్ ట్రైనింగ్ సెంటర్ల సందర్శన

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మండలంలో ఆదివారం ప్రారంభమైన స్కూలు కాంప్లెక్స్ ట్రైనింగ్ సెంటర్ లో భాగంగా రెండవ రోజు సోమవారం పట్టణంలోని స్థానిక గవర్నమెంట్ పాఠశా లలో జరుగుతున్న కాంప్లెక్స్ ట్రైనింగ్ కు డిప్యూటి విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ వృత్తి నైపుణ్యాలను, బోధనను మెరుగు పరుచుకోవడానికి, వాటి అనుభవాలను పంచుకోవడానికి ఈ ట్రైనింగ్ ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడతాయని సూచించారు . ఈ కార్యక్రమంలో పాటు మండల విద్యాశాఖ అధికారులు పి. లీల రాణి , బాలసుందరం , నారోత్తమ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్ లు సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీ సిటీలో పలు పరిశ్రమలకు శంకుస్థాపన చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసిన టిడిపి నాయకులు ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు.

విశ్వవిద్యాలయాభివృద్ధికి కృషి

ద్రావిడ విశ్వవిద్యాలయ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, డిస్టన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఉద్ఘాటన

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : ద్రావిడ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తామని విశ్వవిద్యాలయ నూతన పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, డిస్టన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ లు తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గా డాక్టర్ గణేష్ మూర్తి, డిస్టన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గా డాక్టర్ అక్యూటర్ బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు నూతన బాధ్యతలు అప్పగించిన ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ దొరస్వామి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు అభినందనలు తెలిపారు.

అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని సుజ్ఞానానంద ఆశ్రమంలో అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని స్థానిక ఫొటోగ్రాఫర్లు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఫొటోగ్రఫీ కళకు వన్నె తీసుకువచ్చి ఫాదర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా పేరొందిన లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఫొటోగ్రఫీ కళను గుర్తించిన ఫ్రాన్స్ ప్రభుత్వం 1839 ఆగస్టు 19వ తేదీ ఫొటోగ్రఫీ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. క్రమేపి 2009 నుండి అంతర్జాతీయ ఫొటోగ్రఫీ అసోసియేషన్ వారు ఆగస్టు 19వ తేదీ అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. కుప్పంలోని ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు ఐక్యమత్యంగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ముందుకు సాగాలని నిర్ణయించారు. అనంతరం ఫొటోగ్రాఫర్స్ శుభాకాంక్షలు తెలుపుకుని కలిసికట్టుగా విందు కార్యక్రమంలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ మంత్రి

ప్రజా శక్తి -సదుం : జోగివారిపల్లి గ్రామ పంచాయతీ, బత్తల వారిపల్లి లో సోమవారం ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ప్రస్తుత పుంగనూరు నియోజకవర్గ శాసన సభ్యుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. అనంతరం మార్ధవారిపల్లి లో బాబు రెడ్డి ని, విశ్రాంత ఉపాధ్యాయుడు రమణా రెడ్డి ని, అభిమానులను, కలిసి, వైసిపి నాయుకులను పేరు పేరునా పలకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, జే సి ఎస్ ఇన్చార్జి ప్రకాష్ రెడ్డి, సర్పంచ్ అనిత కుమారి, కువైట్ హరినాథ్ రెడ్డి తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -చిత్తూరు డెస్క్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన యాదమరి మండలంలో సోమవారం చోటుచేసుకుంది. కోనాపల్లి గ్రామానికి చెందిన సంపత్ (34) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యాదమరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడి హత్య కేసులో అన్న అరెస్ట్

ప్రజాశక్తి -పెద్దపంజాణి: మండలంలోని మట్లిగానపల్లిలో తమ్ముడు చెంగయ్యను అన్న వెంకటరమణ కొడవలితో హత్య చేసి చంపిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఈ కేసులో తమ్ముడిని చంపిన అన్న వెంకటరమణను స్థానిక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ మురళీమోహన్ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు పలమనేరు ఇన్‌ఛార్జి ఎస్‌డిపిఓ విష్ణు రఘువీర్ పర్యవేక్షణ లో ఈ కేసుకు సంబంధించి నిందితుడు వెంకటరమణకు, అతని తమ్ముడు అయిన చెంగయ్య కు వారి గ్రామంలో మట్లిగానిపల్లిలో ఆస్తి తగాదాలు ఉన్నాయని పెద్ద మనుషుల పంచాయతీ చేసి ఆస్తి విషయంలో 17 ఆగస్టు 2024వ శనివారం సుమారు 7 గంటలకు వెంకటరమణ తన తమ్ముడైన చెంగయ్యను కొడవలితో తలపై, కుడి రొమ్ముపై దాడి చేశాడు. బలమైన గాయాలు తగలడంతో చెంగయ్య అక్కడికక్కడే చనిపోయాడని తెలిపారు. వెంకటరమణ అక్కడి నుండి పారిపోయాడని చెంగయ్య కూతురు ప్రభావతి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారించామని తెలిపారు. నిందితుడిని 18వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ముందస్తు సమాచారం మేరకు స్థానిక ఎస్సై సహదేవి, సిబ్బంది మురళి రాజు, గుణ వెంకట రమణ, రవి తో సహా మండలంలోని, తులసి మునెమ్మ గుడి సమీపంలోని బస్టాప్ వద్ద నిందితుడిని పట్టుకొని విచారించగా అతను ఆస్తి కోసం స్వంత తమ్ముడిని హత్య చేసినట్లు నేరం అంగీకరించాడని తెలిపారు. అతని వద్ద హత్యకు ఉపయోగించిన కొడవలిని స్వాధీనం చేసుకొని అతడిని రిమాండ్ నిమిత్తం పుంగనూరు కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

అదుపు తప్పి లారీని ఢీకొన్న లారీ

- ఒకరు మృతి - ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: లారీ అదుపు తప్పి మరో లారీని ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం బంగారుపాలెం మండలం మొగిలి సమీపంలో చోటు చేసుకుంది. సీఐ లక్ష్మయ్య కథనం మేరకు శ్రీనివాసపురం నుండి భువనేశ్వరం వెళుతున్న లారీ ముందు వెళుతున్న లారీని ఢీకొని పక్కనే ఉన్న పాదచారుడిని ఢీకొని జాతీయ రహదారి పక్కన ఉన్న కల్వర్టులోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో గాండ్లపల్లికి చెందిన చంద్రశేఖర్ పిళ్లై కుమారుడు జ్యోతీశ్వర్ (55) మృతి చెందాడు. లారీ డ్రైవర్ మస్తాన్‌కు, క్లీనర్ వెంకటసుబ్బయ్యకు గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాద ఘటనలో మరో యువకుడు మృతి



మృతి చెందిన ప్రమోద్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని అప్పిరెడ్డి కండ్రిగ బస్ స్టాప్‌కు సమీపంలో ఈ నెల 12వ తేదీ చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడి ఆసుపత్రి పాలైన సంగతి విదితమే. ఈ ప్రమాదంలో గాయపడిన మరో యువకుడు ఆదివారం మృతి చెందాడు. ఈచర్ వ్యాన్ ను కారు ఢీకొన్న సంఘటనలో ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లి మిట్టకు చెందిన హర్షవర్ధన్ రెడ్డి, ప్రమోద్, ఆకాష్‌లు గాయపడ్డారు. వీరిని తమిళనాడు రాణిపేట ఆస్పత్రికి తరలించగా ఈనెల 13 వతేది హర్షవర్ధన్ రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు ప్రమోద్, ఆకాష్‌లు అక్కడే చికిత్స పొందుతున్నారు. కాగా ప్రమోద్ పరిస్థితి సరిగా లేక పోవడంతో తమిళనాడు నుంచి తిరుపతి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడని వారి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. వేర్వేరు చోట్ల ప్రమోద్‌తో పాటు చదువు కున్న తోటి విద్యార్థులు కొత్తపల్లిమిట్టకు తరలివచ్చి ప్రమోద్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్ఐ వెంకటసుబ్బయ్య బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురు కుప్పం ఎస్ఐగా వెంకటసుబ్బయ్య సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శేషగిరిరావు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ప్రభుత్వం వెంకటసుబ్బయ్యను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సమాజంలో న్యాయాన్ని కాపాడేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.



ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ప్రజాశక్తి -శాంతిపురం: మండల కేంద్రంలోని బాలాజీ కళ్యాణ మండపంలో ఫొటో గ్రాఫర్లు సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ప్రజలు తాము జరుపుకునే వివాహ వేడుకలు, ఫంక్షన్లు, ప్రత్యేక కార్యక్రమాలు, శుభకార్యాలు, ఆనందోత్సాహ వేడుకలు, లాంటి అనేక కార్యక్రమాలు తమ జీవితంలోని ఎన్నో మధురానుభూతులు చిరకాలం గుర్తుండే విధంగా చేయగలిగిన వాడు ఒక ఫొటోగ్రాఫర్ మాత్రమేనని అన్నారు. గతాన్ని, గతంలో జరిగిన సంఘటనలను ఫొటోల ద్వారానే గుర్తు చేసుకోవచ్చున్నారు. ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు లేనిదే ఎలాంటి శుభకార్యాలు, వివాహ వేడుకలు, ఇతర వేడుకలు జరగవని గుర్తు చేశారు. ఫొటోగ్రాఫర్లు ఎల్లప్పుడూ ప్రజలకు సేవకులుగానే ఉంటారన్నారు. అనంతరం ఫొటోగ్రఫీలో ఉత్తమ సేవలు అందించిన ఫొటోగ్రాఫర్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్ నారాయణరెడ్డి, శాంతిపురం మండల ఫొటోగ్రాఫర్ల యూనియన్ అధ్యక్షులు నాగభూషణం రెడ్డి, మునుస్వామి రెడ్డి, లోకనాథ్ రెడ్డి, నాగరాజు, రాజారెడ్డి, భాస్కర్, ఖాదర్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు : ఎఎస్‌పి

ప్రజాశకి- చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా అడిషనల్ ఎస్పీ ఆరీఫుల్లా ఆదేశించారు. సోమవారం జిల్లా ఎస్పి కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి 31 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్.ఆరిఫుల్ల ని , మహిళా డిఎస్పీ సుధాకర్ రెడ్డి ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు.